క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

పూడూరు: కాంగ్రెస్ పార్టీ పూడూరు మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు పరశురాం తల్లి, ఆదే పార్టీ మండల పరిధి చింతల్‌పల్లి గ్రామానికి చెందిన నాయకుడు నడుల్ల సాయి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎరువులు, విత్తనాల నమూనాల సేకరణ



నమూనాలను సేకరిస్తున్న ఏఓ అనురాధ

బొంరాస్‌పేట: నకిలీలను గుర్తించేందుకు ఎరువులు, విత్తనాల నమూనాలను సేకరించామని మండల వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. శుక్రవారం మెట్లకుంట, బొంరాస్‌పేటలోని పలు ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాలను ఏఓ సందర్శించి యూరియా, డీఏపీ వరి విత్తనాలను తీసుకున్నట్లు చెప్పారు. వీటిని మలక్‌పేట కోడింగ్ కేంద్రానికి, అక్కడి నుంచి కోడ్ రహస్యాన్ని మార్చి రాజేంద్రనగర్ లేదా రాష్ట్రంలోని ఏదైనా ల్యాబ్‌లకు పంపిస్తామని పేర్కొన్నారు. గతంలో తుంకిమెట్ల, దుద్యాల దుకాణాల నుంచి ఎరువులు, పత్తి విత్తనాల నమూనాలను సేకరించి, పరీక్షించేందుకు పంపించామని ఏఓ పేర్కొన్నారు.

ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ధారూరు: మండల పరిధి కేరెల్లి గ్రామంలో నెలకొల్పిన సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రంలో ఈ నెల 28న క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు కేంద్రం కన్వీనర్ ఎం.ప్రేం కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదారాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. వ్యాధి ఉందని తేలితే ఎంఎన్‌జే ఆస్పత్రి వారిచే ఉచితంగా వైద్య అందించబడుతుందని పేర్కొన్నారు. ఒక్కో టెస్టుకు రూ.5 వేల నుంచి 6 వేల వరకు వ్యయం అవుతుందని, ఈ కేంద్రం ద్వారా ఉచితంగా చేయిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆపదవస్తే 100కు ఫోన్ చేయండి

తాండూరు రూరల్: ఏదైనా ఆపదవస్తే 100కు డయల్ చేయాలని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం జినుగుర్తి గేటు సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో పోలీస్ కళాజాత బృందంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. బాలికలను ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేసినట్లు తెలిస్తే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాశ్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ నర్సింలు, కళాజాత బృందం ఇన్‌చానిక అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరాధ్య దైవానికి ప్రత్యేకపూజలు



పూజలు చేస్తున్న గిరిజనులు

అనంతగిరి: వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని తమ ఆరాధ్యదైవమైన సీతామాతను గిరిజనులు కోరుకున్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం కోటాలగూడెం గ్రామస్తులు పుడూరు మండలం గొంగుపల్లి సమీపంలోని సీతా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మ కటాక్షం ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.

యువత స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలి

కుల్కచర్ల: యువత స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలని ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి పీరంపల్లి గ్రామ చౌరస్తాలో ఎస్బీఐ మినీ బ్యాంక్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తూ, వారికి సామాజిక, ఆర్థిక, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రజలు ఆర్థికపరమైన లావాదేవీలకు గుర్తింపు పొందిన ఎస్బీఐ లాంటి సంస్థలు ఏర్పాటు కార్యాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీఐ జనరల్ మేనేజర్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సోమలింగం, మురళీ, మినీ బ్యాంక్ నిర్వహకులు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు



తాండూరు టౌన్: మున్సిపల్ కార్యాలయంలో.. చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, కౌన్సిలర్లు

ఉద్యమ దివిటి ‘కొత్తపల్లి’

- మూడు తరాలకు ప్రేరణగా నిలిచిన మహోన్నత వ్యక్తి
- ఆచార్య జయశంకర్ వర్ధంతిలో వక్తలు
- ఉద్యమకారులను ఆదుకోవాలి
- ప్రభుత్వాన్ని కోరిన ప్రజా సంఘాలు

రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడు జయశంకర్ సార్ అని వక్తలు అన్నారు. తెలంగాణ సిద్ధాంత కర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, ఆచార్య కొత్తపల్లి వర్ధంతిని శుక్రవారం జిల్లాలో సకల జనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఆరు దశాబ్దాల పాటు స్వప్నించి, శాసించి మూడు తరాల ఉద్యమకారులకు ప్రేరణగా నిలిచిన మహా మనిషి సార్ అని కొనియాడారు.

తాండూరు టౌన్: తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ జన సమితి తాండూరు ఇన్‌చార్జి సోమశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. పోరాట సిద్ధాంత కర్త, ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా టీజేఎస్, టీవీవీ, టీఎల్ఎఫ్, ఆర్టీసీ, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆచార్య విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. టీజేఏసీ సలహాదారు రంగారావు, శ్రీనివాస్, వీరేశం, శ్రీనివాస్, రామకృష్ణ, మోదీన్, సంజయ్ గౌడ్, గౌరీశంకర్, జగ్గప్ప, ఆదిత్య, రాజశేఖర్, అంజిలయ్య, వాజీద్, జిలాని, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: తెలంగాణ ఏర్పాటు, అభివృద్ధి కోసం పరితపించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ అని టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. సార్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలోని జయశంకర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో టీవీవీ నాయకులు బాకారం చంద్రశేఖర్, అనిల్‌కుమార్, గౌరారం గోపాల్, కాశీపతి, శ్రీహరి ఉన్నారు.



బొంరాస్‌పేట: ఎమ్మార్సీ కార్యాలయంలో..



తాండూరు టౌన్: ఉద్యమకారులు..



కుల్కచర్లలో..

ఏం వండుకు తినాలి?

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

- ఆందోళనలో మధ్య, దిగువ తరగతి కుటుంబాలు



కొడంగల్: కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మార్కెట్లో ఏ కాయగూరల ధరలు చూసినా రూ.100కు పైగా పలుకుతుండటంతో సామాన్యుడు విలవిలలాడిపోతున్నాడు. ఏం కొనాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. శుక్రవారం నాటికి ధరలు ఇలా ఉన్నాయి. కిలోకు.. టమాటా రూ.120, పచ్చి మిరప రూ.120, క్యాప్సికం రూ.120, బీర రూ.120, చిక్కుడు, గోరు చిక్కుడు రూ.150, ఉల్లిగడ్డ రూ.50, కాకర రూ.60, బెండకాయ రూ.80 మిగతావి అదే సరసన ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కిలోకు బదులు అరకిలో, పావుకిలో కొనుగోలు చేద్దామంటే ఇంటిల్లిపాదికి సరిపోదు. దీంతో ఏం వండుకు తినాలో తెలియని స్థితిలో మధ్య తరగతి కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నా యి. ఇదిలా ఉండగా.. ధరల ఘాటుకు తట్టుకోలేక కొందరు అగ్గు వగా దొరకిన వాటితో సరిపెట్టుకుంటుండగా.. ఇంకొందరు పచ్చళ్లతో కాలం వెళ్లబుచ్చుతుండటం గమనార్హం. వర్షాలు లేని కారణంగా కూరగాయల సాగు, దిగుబడి తగ్గడంతో దళారులు, వ్యాపారులు సిండికేటుగా మారి ఇష్టంగా ధరలు పెంచేశారు. దీంతో కూరగాయల మార్కెట్లకు కొనుగోలు దారుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతుండటంతో.. చిన్న వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. గుండుగుత్తగా పోసుకొచ్చిన సరుకు అమ్ముడు కాకపోవడంతో నష్టాలను మూట గట్టుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు. ఏది ఏమైనప్పటికీ.. అంతిమంగా వరుణుడి వర్షిస్తే కానీ.. కూరగాయల ధరలు దిగొచ్చేలా లేవని స్పష్టమవుతోంది.

వారానికోసారి ‘రైతునేస్తం’

బంట్వారం: ఇక నుంచి వారానికి ఒకసారి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతునేస్తం కార్యక్రమం చేపట్టనున్నట్లు వ్యవసాయ అధికారి సంధ్య తెలిపారు. శుక్రవారం రైతు వేదికలో వీసీకి సంబంధించిన సామగ్రిని అమర్చారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 వరకు కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు సాగుకు సంబంధించి వీసీలో వివరంగా సలహాలు, సూచలు ఇస్తారని పేర్కొన్నారు. పంటల సీజన్‌ను బట్టి సాగు విధానం, పురుగు మందుల పిచికారీ, దిగుబడి తదితర అంశాలపై వివరిస్తారన్నారు. విడతల వారీగా ప్రతి రైతు వేదికలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి రైతులు హాజరై.. విలువైన శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు వినాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు మశ్చందర్, అశ్విని పాల్గొన్నారు.

‘ఉపాధి’లెక్కలు పక్కాగా ఉన్నాయి

గ్రామసభలో స్పష్టంచేసిన అధికారులు

దుద్యాల్: 2023–24 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆడిట్ అధికారులు స్పష్టంచేశారు. ఈ మేరకు మండల పరిధి ఈర్లపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆడిట్ అధికారి లక్ష్మీకాంత్ మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో రూ.12 లక్షలతో రోడ్డు, లాండ్ లెవలింగ్, నర్సరీలు, కోపు గుంతలు, జంగల్ కటింగ్ వంటి వివిధ రకాల ఉపాధి పనులు జరిగాయని తెలిపారు. నాలుగు రోజులుగా వీటికి సంబంధించి



గ్రామసభలో అధికారులు, కార్యదర్శులు

లెక్కలు చేశామని, అన్ని పనులు సక్రమంగా జరిగాయని, ఎక్కడా ఎలాంటి అవకతవకలకు చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్, జీపీ కార్యదర్శి ప్రభాకర్ , ఫీల్డ్ అసిస్టెంట్ రాజప్ప, వీరప్ప, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.

తైబజార్ వేలం

బొంరాస్‌పేట: మండల పరిధి తుంకిమెట్ల ఆదివారపు సంత తైబజార్ వేలం రూ.1.70లక్షలకు పలికింది. శుక్రవారం డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ సమక్షంలో తుంకిమెట్లలో నిర్వహించిన వేలం పాటలో ఐదుగురు పాల్గొనగా.. చాకలి నర్సింలు రూ.1.70లక్షలకు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది మార్చి31 వరకు వేలం పొందిన వ్యక్తి.. సంతలో కూరగాయలు, దుకాణాలు, రవాణా వాహనాల నుంచి తైబజారు రుసుము వసూలు చేసుకుంటారు. ఇందులో ఎంపీఓ మహేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.

ముగిసిన బోనఫైడ్ పంచాయితీ

తాండూరు రూరల్: బోనఫైడ్ పంచాయితీపై విచారణ ముగిసిందని కాంప్లెక్స్ హెచ్ఎం వైద్యనాథ్ తెలిపారు. ఈ నెల 19న మండల పరిధి ఉద్దాండపూర్ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటనపై ఎంఈఓ వెంకటయ్య ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న శరత్ బోనఫైడ్ సర్టిఫికెట్‌ను విద్యార్థి తండ్రి రాములు వారం క్రితం తీసుకెళ్లారని తెలిపారు. దీంతో విద్యార్థి.. 19వ తేదీ (బుధవారం) బడికి వెళ్లగా.. హెచ్ఎం రవిందర్‌కుమార్ శర్మ అనుమతించలేదని చెప్పారు. ఈ విషయంలో బాలుడి తండ్రి, హెచ్ఎం మధ్య గొడవ జరిగిందని వివరించారు. అనంతరం రాములు ఎంఈఓకు ఫిర్యాదు చేయ గా.. విచారణ చేపట్టినట్లు హెచ్ఎం వెల్లడించారు. వివాదం ముగిసిందని, విద్యార్థిని పాఠశాలకు శనివారం నుంచి అనుమతించినట్లు స్పష్టంచేశారు.



పోతురాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు

ఎల్లమ్మకు బోనాలు

కుల్కచర్ల: బోనాల పండుగ ఘనంగా జరిగింది. మండల పరిధి కామునిపల్లి గ్రామంలో శుక్రవారం ఎల్లమ్మ తల్లికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనం చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య, పోతు రాజుల విన్యాసాలతో అమ్మవారి సన్నిధికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, వర్షాలు సమృద్ధిగా కురిపించి పాడి పంటలతో పల్లెలు పచ్చగా ఉండేలా చూడు తల్లి అని భక్తులు అమ్మవారిని కోరుకున్నారు.



అనంతగిరి: వికారాబాద్ కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



అనంతగిరి: రైల్వే ఫంక్షన్ హాల్‌లో..



పూడూరు: మోడల్ స్కూల్లో యోగా డే ఆకారంలో విద్యార్థులు

యోగాతో ఆరోగ్య భాగ్యం

‘యోగా మనిషికి దివ్య ఔషధం. ఆసనాలు వేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. మనసు ప్రశాంతంగా ఉండటమే కాకుండా.. క్రమశిక్షణ అలవడుతుంది. వ్యాపించిన వ్యాధులు అదుపులో ఉంటాయి. రోగ నిరోధక శక్తి పెరిగి, రోగాలను దరిచేరనివ్వదు. నిత్యం యోగా చేయండి. ఆరోగ్యంగా ఉండండి’ అని యోగా నిపుణులు స్పష్టంచేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పాఠశాలలు, యోగా శాలలు, మైదానాల్లో యోగా కార్యక్రమాలు చేపట్టగా.. ఆసక్తి ఉన్నవారు నిపుణుల సూచనల మేరకు ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. యోగా ఈనాటిది కాదని, పురాతనమైన భారతీయ సంస్కృతిలో భాగమేనని చెప్పారు. యోగా వలన ఆరోగ్య సిరి మనసొంతం అవుతుందని స్పష్టంచేశారు. -సాక్షి, నెట్‌వర్క్



పెద్దేముల్: ఉన్నత పాఠశాలలో యోగ చేస్తున్న విద్యార్థులు



తాండూరు టౌన్: జైశ్రీరాం వాకింగ్ గ్రూప్ సభ్యుల యోగాసనాలు



తాండూరు టౌన్: యోగాసనంలో మధుకర్, యోగ సాధకుడు



తాండూరు టౌన్: యోగాసనంలో చిన్నారి శ్రీక్షిత



పరిగి: యోగలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు

ప్రతిభకు పురస్కారం



కుల్కచర్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని నిజాం కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో యోగా, హఠయోగంలో ప్రతిభ చూపిన ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన టి.భీమయ్య గౌడ్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. నేటి బాలబాలికలకు యోగా పట్ల అవగాహనను పెంపొందించాలని మంత్రి భీమయ్య సూచించారు.



కొడంగల్‌లో..



దోమ: కస్తూర్బాగాంధీలో..



దుద్యాల్: గిరిజన గురుకుల పాఠశాలలో..



యాలాల: మండల కేంద్రంలో ఆసనాలు వేస్తున్న ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా తదితరులు



తాండూరు రూరల్: సిరిగిరిపేట్ ప్రాథమికోన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం




దుద్యాల్: గిరిజన గురుకుల పాఠశాలలో..

రవాణా సౌకర్యంతో అభివృద్ధి

మర్పల్లి: రవాణ సౌకర్యం మెరుగు పడినప్పుడే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు గూడెం రాములు యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధి పంచలింగాల వయా శంకర్‌పల్లి టు హైదరాబాద్(దిలుసుఖ్‌నగర్)కు రూట్‌లో నడిచే హైదరాబాద్–2 డిపోకు చెందిన బస్సును సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫసియొద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మణిల ప్రారంభించారు. ఈ సందర్భంగా గూడెం మాట్లాడారు. మండంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులు వచ్చే విధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో మాట్లాడి రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుత సర్వీసు విషయమై.. గతంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి స్పీకర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన బస్ సౌకర్యం కల్పించారని తెలిపారు. ఈ సందర్భంగా సభాపతికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఆర్టీసీ సిబ్బంది, అతిథులకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, మాజీ సర్పంచ్‌లు సురేష్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు కళాశాలలో నాణ్యమైన విద్య



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

దోమ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని ప్రిన్సిపాల్ మంజుల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులతో కలిసి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా ప్రతి మండలంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు, మెరుగైన విద్యను అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదించాలని పేర్కొన్నారు.